క్లుప్తంగా

మెరుగైన సేవలందించాలి



మందుల స్టాకును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

మిడుతూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించాలని నంద్యాల డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ సూచించారు. బుధవారం మండల పరిధిలోని కడుమూరు, తలముడిపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. హాస్పిటల్స్‌కు వచ్చే వారిపట్ల విసుగు చెందకుండా మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించడంతోపాటు రికార్డులను పకడ్బందీగా నిర్వహించుకోవాలన్నారు. అనంతరం హాస్పిటల్‌లో మెడిసిన్ స్టాకు వివరాలను, రోగులకు అందే వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్ గౌడ్, డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వం

పాములపాడు: గ్రామంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొని తాగునీటి సమస్య తలెత్తనివ్వమని సర్పంచు వరప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో 5హెచ్‌పీ విద్యుత్ మోటారు మరమ్మతులు చేయించారు. సర్పంచు మాట్లాడుతూ గ్రామంలోని దేవనగర్‌లో 2 రోజుల క్రితం మోటారు మరమ్మతులకు గురైందన్నారు. వెంటనే మెకానిక్‌ను పిలిపించి మోటారును బయటకు తీయించి మరమ్మతులు చేయించామన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మిడుతూరు గ్రామంలో స్వామివారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వార్ల ఉత్సవమూర్తులను ట్రాక్టర్‌లో ఆశీనులను చేసి మేళతాళాలతో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు నరహరి శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

ఆత్మకూరు: మినుము పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మినుము పంటలో లద్దె పురుగు అధికంగా వ్యాపించే అవకాశం ఉందని చెప్పారు. ఇందుకు రైతులు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులు తెగుళ్లు సోకిన వెంటనే సమీపంలోని ఆర్‌బీకేలోని వ్యవసాయాధికారులతో సలహాలు తీసుకోవాలన్నారు.

రేపు రజక వృత్తి దారుల సదస్సు

పాములపాడు: ఈ నెల 6న కర్నూలు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రజక వృత్తిదారుల సదస్సుకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో కర పత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రజకుల భద్రత కోసం ఎస్సీ, ఎస్టీ తరహాలో సామాజిక చట్టం ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం రజక సత్రం కోశాధికారి గోపాల్, నాయకులు రాజు,లింగస్వామి, మురళిమోహన్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ శైని ప్రియాంక

నందికొట్కూరు: రోగులకు ఆసుపత్రి వేళ్లలో అందుబాటులో ఉంటానని డాక్టర్ శైని ప్రియాంక అన్నారు. బుధవారం పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యురాలిగా బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ సర్వ రోగాలకు వైద్య చికిత్సలు అందించి, అవసరమైతే కర్నూలు ప్రభుత్వం వైద్యశాలకు రెఫర్ చేస్తామన్నారు. రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని చెప్పారు.

రేపు వాహనాల వేలం

నందికొట్కూరు: ఈ నెల 6న పట్టుబడిన వాహనాలకు వేలం పాట నిర్వహిస్తునట్లు సెబ్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆసక్తి గలవారు రూ. 3 వేలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. ఆధార్‌కార్డు, జిరాక్స్ కాపీ ఇచ్చి, ఎంట్రీ పాస్ తప్పక తీసుకోవాలని చెప్పారు. వేలంలో వాహనాలను దక్కించుకున్న వారు వెంటనే జీఎస్టీతో పాటు మొత్తం డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఏకైక సీఎం జగనన్న

- పింఛన్లు తొలగిస్తున్నారనే టీడీపీ నాయకుల మాటలు నమ్మొద్దు
- ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంపు
- అర్హత ఉన్నవారందరికీ మంజూరు
- పెంచిన, నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ



జూపాడుబంగ్లాలో పెంచిన పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారురాలికి అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: ఇచ్చిన హామీలను మూడేళ్లలోనే నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం జూపాడుబంగ్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పెంచిన పింఛన్లు, నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏటా రూ.250ల చొప్పున పింఛన్ మొత్తం పెంచుతూ పోతానన్న మాట ప్రకారం సీఎం ఈ ఏడాది రూ.250ల పింఛన్ మొత్తాన్ని పెంచినట్లు తెలిపారు. గతేడాది ఇచ్చిన రూ.2,500లకు రూ.250లు కలిపి ఈ ఏడాది నూతన కానుకగా పింఛన్ దారులకు రూ.2,750లను ఇస్తున్నట్లు తెలిపారు. రాయకీయ లబ్ధికోసం టీడీపీ నాయకులు పింఛన్లు తొలగిస్తున్నారని ప్రచారం చేస్తున్నారని, వారి మాటలు నమ్మవద్దని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వారందరికీ పింఛన్లు మంజూరవుతున్నాయని తెలిపారు. టీడీపీ పాలనలో అర్హత ఉన్నా పింఛన్ రావాలంటే జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. జగనన్న సీఎం అయ్యాక ఎవరి ప్రమేయం, ఎలాంటి పరపతి లేకున్నా అర్హత ఉన్నవారందరికీ పార్టీలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు.

ఇంటి ముంగిటకే పింఛన్

గతంలో పింఛన్ సొమ్ము తీసుకోవాలంటే పంచాయతీ కార్యాలయాల వద్ద రోజులు తరబడి పడిగాపులు కాయాల్సివచ్చేదని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్లు తెల్లవారకముందే ఇంటివద్దకు వచ్చి అవ్వా, తాత, అక్కా, చెల్లెమ్మలకు పింఛన్ సొమ్ము అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంజులవాణి, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఏపీఎం అంబమ్మ, ఏపీఓ గౌరీబాయి, సర్పంచులు బాలస్వామి, కృష్ణమ్మ, బాలమద్దిలేటి, ఎంపీటీసీ కృపాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు జంగాలపెద్దన్న, కిరణ్‌కుమార్‌రెడ్డి, శివానందరెడ్డి, తరిగోపుల కృష్ణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడు, దిలీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

కొత్తపల్లి: పేదప్రజల కుటుంబాలకు నెలసరి పింఛనతోనే ఆర్థిక భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ మేరీ ఆధ్వర్యంలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కుటుంబాలలో నెల తిరగముందే ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతుంటాయని, అటువంటి కుటుంబాలలో గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా 1 వతేది తెల్లవారకముందే పింఛన్ ఇస్తుండడంతో ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. మండలంలో 142 మందికి కొత్త పింఛన్లను మంజూరు అయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయకుడు, ఏపీఎం పుల్లయ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కమల, డీప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సర్పంచులు విజయ్‌కుమార్, చంద్రశేఖర్ యాదవ్, కలబండి మారెన్న, శివపురం ఎంపీటీసీ శివన్న, జగనన్న ఇళ్ల స్థలాల మండల కో–ఆర్డినేటర్ పరశురాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు జీఎండీ రఫీ, శ్రీనాథరెడ్డి, కె.మల్లికార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మిడుతూరులో పింఛన్ల పంపిణీ

మిడుతూరు: జగనన్న పెన్షన్ వారోత్సవాలలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నూతన పింఛన్లను నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ జీఎన్‌ఎస్ రెడ్డి తెలిపారు.

అర్హులందరికీ పింఛన్ల మంజూరు



పింఛన్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

నందికొట్కూరు: అర్హులైన వారందరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసిందని మున్సిపల్ కమిషనర్ కిషోర్ అన్నారు. బుధవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో 2, 6 సచివాలయాల పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను కమిషనర్‌తో పాటు కౌన్సిలర్లు రాధిక, హమీద్, కుర్వ లక్ష్మీదేవి, కరీష్మా, జాకీర్ అందజేశారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం శాంతకుమారి, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు శాలు, శ్రీను, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని 10వ వార్డులో బుధవారం నూతన పింఛన్లను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్ షేక్షావలి , షంషూర్‌లు పంపిణీ చేశారు.



ఆత్మకూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

‘ఫ్యామిలీ ఫిజీషియన్’తో మెరుగైన వైద్యసేవలు



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను ప్రవేశపెట్టిందని వైద్యాధికారి వినోద్‌కుమార్, 104 వైద్యురాలు సుధాప్రణతి తెలిపారు. బుధవారం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రజలకు బీపీ, షుగర్, ఒళ్లునొప్పులు, దగ్గు, జ్వరం, జలుబు ఇతరత్ర వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రయోజనాలు మెండు

మిడుతూరు: ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రయోజనాలు మెండుగా ఉంటాయని తలముడిపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ చిన్న మద్దిలేటి అన్నారు. బుధవారం అలగనూరులో ఫ్యామిలీ హెల్త్ క్యాంపును నిర్వహించారు.అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్ వాడీ కేంద్రాలను తనిఖీ చేసి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై, ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ రఫీ, ఏఎన్‌ఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

- అర్హతే ప్రామాణికంగా పథకాలు
- ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



గాజులపల్లెలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మహానంది: అర్హతే ప్రామాణికంగా అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందిస్తూ సంక్షేమ పాలనను కొనసాగిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గాజులపల్లెలో బుధవారం రాత్రి వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ అందరి ఆర్థికాభివృద్ధి కోసం సీయం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. పేదల అభ్యున్నతి కోసం కష్టపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గ్రామస్వరాజ్యపాలనకు శ్రీకారం చుడుతూ ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ దేశానికి ఆదర్శనంగా నిలిచిందని చెప్పారు. గ్రామంలోని సచివాలయాల పరిధిలో సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ గ్రామాలభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగభూపాల్‌రెడ్డి, మహానందిశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కొమ్మబాలపాల మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, గోపవరం సొసైటీ చైర్మన్ గాజులపల్లె కిట్టు(రామకృష్ణ), ఎంపీటీసీలు ఒడుగూరి లక్ష్మీదేవి, నరసింహులు, సర్పంచ్ గడ్డం చంటి, వైఎస్సార్‌సీపీ నాయకులు గజ్జె పెద్దపక్కీరయ్య, కొండా మధుసూదన్ రెడ్డి, మహానంది ట్రస్ట్‌బోర్డు మెంబర్ గజ్జె సంపూర్ణ, శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు మాజీ మెంబర్ రవిస్వామి, వీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నారాయణ, చౌటుపల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘గడప గడపకు మనప్రభుత్వం’

గాజులపల్లె గ్రామంలో గురువారం రెండోరోజు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కొమ్మాపాల మహేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

వలసలు వెళ్లకుండా పనులు కల్పించాలి



ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏపీడీ బాలాజీ నాయక్

మిడుతూరు: ఉపాధి కూలీలు వలసలు వెళ్లకుండా జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు చూపించాలని నంద్యాల ఏపీడీ బాలాజీనాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చౌట్కూరు, 49–బన్నూరు, చింతలపల్లి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రం, రహదారికి ఇరువైపుల నాటిన మొక్కలు, దేవనూరు గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్లను, చింతలపల్లిలో హార్టికల్చర్ కింద నాటిన పండ్ల తోటలను పరిశీలించారు. ఏపీడీ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టడంతో పాటు పండ్ల తోటల పెంపకం చేపట్టేలా చైతన్యం తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో చౌట్కూరు సర్పంచ్ మదార్ సాహెబ్, ఏపీఓ జయంతి, ఈసీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శనగల బసవన్నకు పరోక్షసేవ



పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి బుధవారం సాయంత్రం త్రయోదశి సందర్భంగా పరోక్ష సేవను ఈఓ ఎస్ లవన్న, అర్చకులు పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా నందీశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాధి అర్చనలను గావించారు. ఆరంభ పూజలలో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. శనగల బసవన్నకు శాస్త్రోక్తంగా విశేష అన్నాభిషేకాలను నిర్వహించారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను మహా నైవేద్యంగా సమర్పించారు.

13 నుంచి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

వెలుగోడు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 13, 14వ తేదీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు షంషీర్ అలీ తెలిపారు. బుధవారం టోర్నమెంట్ పోస్టర్లను ఆవిష్కరించారు. పోటీల్లో విజేతలకు వరుసగా మొదటి బహుమతి రూ.8,000 (దాత: డి.షంషీర్ అలీ), ఎం. ఇలియాస్ ఖాన్ సహకారంతో ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. రెండో బహుమతి రూ.7,000 (దాత: సర్పంచ్ వేల్పుల జయపాల్), మూడో బహుమతి రూ. 6,000 (దాత: ఎంపీపీ లాలం రమేష్), నాలుగో బహుమతి రూ.5,000 (దాత: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రభాకరరెడ్డి), ఐదో బహుమతి రూ.4,000 (దాత: మోతుకూరు ఎం.సుధాకరరెడ్డి), ఆరవ బహుమతి రూ.3,000 (దాత: ఆసిఫ్ అలి ఖాన్), ఏడో బహుమతి రూ. 2,000 (దాత: జాకీర్ (జగ్గయ్య), ఎనిమిదో బహుమతి రూ. 1000 (దాత: మొహమ్మద్ ఖాన్) అందజేస్తారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9885204197 నంబర్లో సంప్రదించాలన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి



మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వార్డు కౌన్సిలర్లు

ఆత్మకూరు: పట్టణంలోని కిశన్‌సింగ్ సచివాలయ పరిధిలోని సంతమార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని చేపట్టిన అక్రమకట్టడాన్ని తొలగించాలని 11వ వార్డు కౌన్సిలర్ గౌస్‌లాజం కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆసియామారూఫ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఓ మాజీ కౌన్సిలర్ రోడ్డు పక్కన ఉన్న స్థలాన్ని కబ్జా చేయడం సరికాదన్నారు. రహదారి వెంట ఇబ్బందికరంగా మారిందన్నారు. సత్వరమే మున్సిపల్ అధికారులు స్పందించి ఈ అక్రమకట్టడాలు తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం

నందికొట్కూరు: సంతగేట్ మండల ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థులు రామిరెడ్డి, సురేష్, లక్ష్మినారాయణ, సిరిగౌడ్, కేథార్ 5 ఫ్యాన్లు, 10 ట్యూబ్ లైట్లు, విద్యార్థులకు 200 పేట్లు బుధవారం అందజేశారు. వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు తమ వంతు సహకారం అందించామన్నారు.

సాక్షిగణపతికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతో, ఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్ర స్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

రైతు సంఘాలతో ప్రయోజనం

పాములపాడు: రైతు సంఘాల ఏర్పాటులో చాలా ఉపయోగాలున్నాయని హార్టికల్చర్ ఏఓ హరినాథ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వానాల గ్రామంలో మన ఊరి నేస్తాలు రైతు ఉత్పత్తి దారుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కలెక్షన్ సెంటర్(గోదాము)ను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ఇప్పటికి మండలంలో వానాలతో పాటు వేంపెంటకు ఒక గోదాము మంజూరైందన్నారు. రైతుఉత్పత్తి దారుల సంఘాల వల్ల మన రైతులకు మనమే మేలు చేసినవారమవుతామన్నారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ శివపుల్లారెడ్డి, బోర్డు డైరెక్టర్లు చంద్రకళ, శ్రీనివాసులు, నర్సింహులు, బాలునాయక్, మమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలం కరివేన గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆత్మకూరు పట్టణానికి చెందిన జి. గుణశేఖర బాబు అనే వ్యక్తి అప్పారావు వీధిలో నివాసముంటున్నాడు. ఈయన భార్య విజయలక్ష్మి కొట్టాల చెర్వు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తోంది. బుధవారం గుణశేఖర బాబు తన ద్విచక్ర వాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం కరివేన వైపు వెళ్తుండగా వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో గుణశేఖర బాబు తలకు తీవ్రగాయమైంది. పరిస్థితి విషమంగా ఉండటంతో 108 సిబ్బంది కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

పగిద్యాల: జగనన్న పింఛన్ కానుక వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలానికి మంజూరైన కొత్త పింఛన్లను పంపిణీ చేసేందుకు నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరవుతున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ బుధవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 8 గ్రామ పంచాయతీలకు 112 కొత్త పింఛన్‌లు మంజూరు అయ్యాయని వెల్లడించారు. ఉదయం 10 గంటలకు లబ్ధిదారులు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

శుక్రవారం నుంచి ‘గడప గడపకు మన ప్రభుత్వం’

ఆత్మకూరు: మండలంలో శుక్రవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంజాద్ అలీ తెలిపారు. ఈ నెల 6న ఉదయం సిద్ధపల్లి, మధ్యాహ్నం పెద్దనంతపురం, 7న అమలాపురం గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అందించటమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తెలిపారు. బుధవారం మండలంలోని తాటిపాడు గ్రామంలో సర్పంచ్ వంగల లక్ష్మిదేవి అధ్వర్యంలో రెండో రోజు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ పాలనలో పచ్చచొక్కాలు వేసుకొన్న వారికి, పలుకుబడి ఉన్నవారికి, లంచాలిచ్చిన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలిచ్చేవారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాకా పార్టీలకు అతీతంగా ఎలాంటి భేదాభిప్రాయాల్లేకుండా అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గ్రామస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడికక్కడే ఎమ్మెల్యే అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ మంజులవాణి, ఏఓ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయపు సుధ, వంగల కృష్ణారెడ్డి, ఉస్మాన్‌బాషా, శివానందరెడ్డి, జంగాలపెద్దన్న, కిరణ్‌కుమార్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ కృపాకర్, ఆర్‌ఎంపీ ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు

నంద్యాల(సిటీ): జిల్లాస్థాయి హ్యాండ్ బాల్ బాలుర సబ్ జూనియర్ (అండర్–15), జూనియర్ (అండర్–19) జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తామని హ్యాండ్‌బాల్ సంఘం ప్రతినిధులు మహబూబ్ బాషా, రామేశ్వరరెడ్డి, రాజకుమార్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు సబ్ జూనియర్ 2007–09, జూనియర్ 2003–06 సంవత్సరాల మధ్యలో జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 13,14 తేదీల్లో కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి



వినియోగదారులతో మాట్లాడుతున్న సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్‌రెడ్డి

మహానంది: మద్యం షాపుల్లో మద్యాన్ని ఎమ్మార్పీలకే విక్రయించాలని సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ రెడ్డి తెలిపారు. తిమ్మాపురం వైన్‌షాపులో బుధవారం తనిఖీలు నిర్వహించారు. సూపర్‌వైజర్ గోపాల్, సిబ్బంది సురేష్, హర్షలతో వివిధ అంశాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై లక్ష్మి పాల్గొన్నారు.

అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీ



పగిద్యాలలో విద్యార్థులకు బ్రెయిలీ గురించి వివరిస్తున్న ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు

నందికొట్కూరు: అంధులకు అక్షరాన్ని ఇచ్చిన శిల్పి లూయిస్ బ్రెయిలీ అని దివ్యాంగుల సంఘం నాయకులు షేక్షావలి, శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని వాసవీ భవనం వద్ద లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగరాజు, హుసేన్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పగిద్యాల: స్థానిక భవిత కేంద్రంలో బుధవారం లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఐఈఆర్టీ ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, అరుణకుమారి, ఫిజియోథెరపిస్ట్ క్రిష్ణప్రియ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌బాబు, మధుసూదన్‌రెడ్డిలు నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు బహుమతులు అందజేశారు.

పాములపాడు: స్థానిక భవిత సెంటర్‌లో బుధవారం విద్యార్థులకు మిఠాయిలు పంచి బెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా పీడీ దేవానంద్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఓం ప్రకాష్, సీఆర్పీ మల్లికార్జున, ఈఆర్టీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.